ప్రజా విశ్వంభర V3 NEWS

అలాంటి సినిమాలు చేయడం నాకిష్టం లేదు..



సినిమా రంగంలో ఎప్పటికప్పుడు మారుతున్న ట్రెండ్స్‌ను అనుసరించకుండా.. తన మనసుకు నచ్చిన కథలనే ఎంచుకుంటానని అంటున్నారు నటి తాప్సీ పన్ను. ప్రస్తుతం ఏ తరహా సినిమాలు విజయాలు సాధిస్తున్నాయనే దానికంటే.. ఒక నటిగా తనకు ఏ కథ నచ్చింది? ఏ పాత్ర చేయాలనిపిస్తోంది? అనే విషయాలకే ప్రాధాన్యమిస్తానని ఆమె తెలిపారు. తాను సినీ పరిశ్రమలో సుదీర్ఘప్రయాణం చేయాలనుకుంటున్నానన్నారు. తాప్సీ తాజాగా 'టైమ్ 100 నెక్ట్స్ ఇండియా' 2026 జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో తన కెరీర్, సినిమాల ఎంపిక గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. "వయసు పెరుగుతున్న కొద్దీ కొంత ప్రశాంతంగా మారాను. కెమెరా ముందు ఉన్నప్పుడు నేను వేరేలా ఉంటాను. వ్యక్తిగత జీవితంలో ఎలాంటి ముసుగు వేసుకోకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాను. సినిమాల్లో కూడా అంతే.. ఏదైనా పాత్రను లేదా మూవీని ఎంచుకునేటప్పుడు నాకు ఏది సరైనదనిపిస్తుందో.. నా అంతరాత్మ ఏం చెబుతుందో దాని ఆధారంగానే నిర్ణయం తీసుకుంటాను". "ప్రస్తుతం ఏదో జానర్ ట్రెండ్‌లో ఉందని దాని వెనుకే వెళ్లడం నాకిష్టం లేదు. ఒక సినిమా బాగా ఆడుతోంది కదా అని అలాంటి సినిమానే చేయాలని అనుకోను. అలా చేస్తే ఈ రోజు ప్రేక్షకులకు నచ్చొచ్చు. కానీ, అదే ట్రెండ్‌ని అందరూ ఫాలో అయితే కొన్నేళ్ల తర్వాత దానికి గుర్తింపు ఉండదు. అందుకే నేనెప్పుడూ సుదీర్ఘకాలం ఈ రంగంలో కొనసాగాలనే ఆలోచనతోనే సినిమాలను ఎంచుకుంటాను" అని ఆమె పేర్కొన్నారు. తన కెరీర్ ప్రారంభంలోనే స్పై సినిమాలు చేసిన విషయాన్ని తాప్సీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో ఆ జానర్ ట్రెండ్‌లో లేదు. అయినా, 'బేబీ', 'నామ్ షబానా' సినిమాలు చేశాను. అలాగే 'మన్‌మర్జియాన్' కూడా అప్పటి ట్రెండ్‌ను చూసి ఎంచుకున్న సినిమా కాదు. నాకు చేయాలనిపించింది కాబట్టే చేశాను. కేవలం సినిమాలే కాకుండా నాకంటూ ఒక వ్యక్తిగత జీవితం ఉంది. దాన్ని కొనసాగించాలి. అప్పుడే మనిషిగా ఎదగగలం. వ్యక్తిగా ఎదగకపోతే ఆ ఎదుగుదల నటనలోనూ కనిపించదు" అని తాప్సీ చెప్పుకొచ్చారు.

తెలుగు చిత్రసీమ గర్వించేలా వృషకర్మ



ఒక అద్భుతమైన విజన్‌తో రూపొందిన 'వృషకర్మ' తెలుగు సినిమా గర్వంగా చెప్పుకునేలా ఉంటుందన్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా.. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది.మీనాక్షి చౌదరి కథానాయిక. స్పర్ష్‌శ్రీవాస్తవ ముఖ్యపాత్ర పోషించారు. బి.వి.ఎస్. ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ చిత్రం డిసెంబరు 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం నెల్లూరులో ట్రైలర్ ఆవిష్కరణ వేడుకని నిర్వహించారు. ఐదు వేల ఏళ్ల పురాతనమైన ఒక అతీంద్రియ శక్తిని పరిచయం చేస్తూ మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. వేడుకని ఉద్దేశించి నాగచైతన్య మాట్లాడుతూ "ఒక కొత్త ఆలోచనతో కార్తీక్ ఈ కథని రాశారు. ఎప్పుడూ చూడని విజువల్స్ ఇందులో ఉన్నాయి. తెలుగురాష్ట్రాల నుంచి ఎంతోమంది గొప్ప దర్శకులు వచ్చి, దేశమంతా సత్తా చాటుతున్నారు. ఆ జాబితాలో కార్తీక్ చేరబోతున్నారు. మీనాక్షి, స్పర్ష్ అద్భుతమైన నటనని ప్రదర్శించారు" అని అన్నారు.కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.



పది రోజుల్లో స్పష్టత!

'వారణాసి' సినిమాకు సంబంధించి ఏదో ఒక విషయంపై సామాజిక మాధ్యమాల్లో తరచూ చర్చ సాగుతోంది. ఆస్కార్‌ని గెలిచిన 'ఆర్ఆర్ఆర్' తర్వాత అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రపంచస్థాయి సినిమా ఇది. తొలిసారి ఆయనతో అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు జట్టు కట్టారు. ఎన్నో విషయాల్లో ప్రత్యేకమైన ఈ సినిమా విడుదల తేదీపై ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల అని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. అయితే ఆ తేదీ దగ్గర పడుతుండటం, ప్రచార కార్యక్రమాలు ఇంకా మొదలు కాకపోవడంతో ఈ సినిమా అనుకున్న సమయానికే వస్తుందా లేదా అనే ఉత్కంఠ మొదలైంది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ విషయంపై ఇంకో పది రోజుల్లో స్పష్టత ఇవ్వాలనే ఆలోచనలో చిత్రబృందం ఉంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి కాగా, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. డిసెంబరు తొలి వారం నుంచి డబ్బింగ్ పనులు మొదలు కానున్నాయని సినీ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ చిత్రాన్ని కేఎల్ నారాయణ, ఎస్.ఎస్.కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం సినిమా

57వ 'ఇఫి' వేడుకల్లో అనిల్ రావిపూడి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్ర ప్రదర్శన



అగ్ర కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో తెరకెక్కిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. సంక్రాంతికి విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుందీ సినిమా. బుధవారం ఈ చిత్రం గోవాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫి)లో భాగంగా ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శితమైంది. ఈ వేడుకకు హాజరైన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, కె.సుస్మిత, నటి కేథరిన్ రెడ్ కార్పెట్ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అనిల్ మాట్లాడుతూ... "ప్రేక్షకులను నవ్వించడం చాలా శ్రమతో కూడిన సృజనాత్మక ప్రక్రియ. చిరంజీవి లాంటి సీనియర్ నటుడికి కుటుంబ భావోద్వేగాలతో ముడిపడిన హాస్యాన్ని రాయడం పెద్ద సవాలు. రాసే జోకులు ప్రేక్షకులకు నచ్చుతాయో లేదో ఊహించడం చాలా కష్టం. అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే కథలను రూపొందించడమే నా ప్రయత్నం. పండుగ సీజన్ సహజంగానే కుటుంబ వినోద చిత్రాలకు అనుకూలంగా ఉంటుంది. కుటుంబాలు థియేటర్లకు వస్తాయి. సినిమా... ప్రేక్షకుల రోజువారీ జీవితంలోని ఒత్తిడి నుంచి ఉపశమనం అందిస్తుంది. వారి ముఖాలపై చిరునవ్వులు తీసుకురావడంలో ఉన్న ఆనందమే ఇలాంటి చిత్రాలను రూపొందించడానికి నాకు ప్రధాన ప్రేరణ. 'ఇఫి'లో మా చిత్రాన్ని ప్రదర్శించడం సంతోషంగా ఉంది. వేదుకలో భిన్న చిత్రాలకు చోటు కల్పించే ప్రయత్నం ఎంతో అభినందనీయం" అని అన్నారు.

కుటుంబ విలువలతో..'ఆలోచన'

"కన్న తల్లిదండ్రులు దైవంతో సమానం. వాళ్లని కాపాడుకోవాలంటూ మనవైన కుటుంబ విలువలు, మానవ విలువల్ని చాటి చెప్పిన గొప్ప సినిమానే 'ఆలోచన'. ఇందులోని సందేశమనసుల్ని హత్తుకునేలాఉంటుంది" అన్నారు ప్రముఖ దర్శకనిర్మాత, నటుడు ఆర్.నారాయణ మూర్తి. ఆయనతోపాటు, ప్రముఖ నటులు మురళీమోహన్, దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ముఖ్య అతిథులుగా ఇటీవల హైదరాబాద్‌లో 'ఆలోచన' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. జి.వి.నారాయణరావు, ప్రసాద్‌బాబు, నరసింహరాజు, మహర్షి రాఘవ, జయలలిత, రజన్ హరి, బెన్నీ సుధాకర్, సుజన, అనుపమ స్వాతి, మాధవి ముఖ్య పాత్రల్లో నటించారు. సురేందర్ చాచా దర్శకత్వం వహించారు. ప్రదీప్‌కుమార్, గుండబోయిన శ్రీనివాస్ నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన



వేడుకలో మురళీమోహన్ మాట్లాడుతూ "ఒక భిన్నమైన సినిమా చూసిన అనుభూతి కలిగింది. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మెప్పించాయి" అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ "చేతనైతే మంచి చేయి, చెడు మాత్రం చేయకు అని చెప్పే మంచి కథతో ఈ చిత్రం రూపొందింది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందంతో పాటు, నటులు జయలలిత, కరాటె కల్యాణి, రాగిణి, నిర్మాతలు ప్రతాని రామకృష్ణగౌడ్, సురేశ్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.

'రాకా'లోకి బాలీవుడ్ స్టార్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. ఇప్పటికే అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌తో దేశవ్యాప్తంగా భారీ అంచనాలు పెంచుకున్న ఈ సినిమాలో తాజాగా బాలీవుడ్ సీనియర్ నటుడు ఇందులో భాగం కానున్నారనే వార్త సినీ వర్గాల్లోఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్ నుంచి అందుతున్న సమాచారం ప్రకారం బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా ఈ సినిమాలో కీలకమైన పాత్రలో నటించనున్నట్లు టాక్.ఆయన పాత్ర నిడివి తక్కువగా ఉన్నప్పటికీ కథలోచాలా ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. నిజమైతే గోవిందాకు ఇదే తొలి తెలుగు లేదా దక్షిణాది సినిమా కానుం డటం విశేషం. ఇక ఈ సినిమాలోదీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండగా.. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు.సైన్స్ ఫిక్షన్, యాక్షన్ అంశాలతో విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించేం దుకు అట్లీ సిద్ధమవుతుండగా.. ఇప్పటికే మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన ఈ చిత్రం

'బ్రహ్మాస్త్ర 2' ఆగిపోలేదు..మరింత భారతీయతతో తెరకెక్కిస్తా



రణబీర్ కపూర్ అభిమానులకు బిగ్ అప్డేట్ వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన 'బ్రహ్మాస్త్ర' సినిమాకు సీక్వెల్‌గా రావాల్సిన 'బ్రహ్మాస్త్ర 2: దేవ్' ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలకు దర్శకుడు అయాన్ ముఖర్జీ తాజాగా చెక్ పెట్టారు. 'బ్రహ్మాస్త్ర 2' కచ్చితంగా తెరకెక్కుతుందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టలేదని స్పష్టం చేశారు. గోవాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా 2026లో పాల్గొన్న అయాన్ ముఖర్జీ, తొలి భాగానికి వచ్చిన స్పందనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "బ్రహ్మాస్త్ర'లో ప్రేక్షకులు ఇష్టపడిన అంశాలు కొన్ని ఉన్నప్పటికీ, నచ్చని అంశాలు కూడా ఉన్నాయి. ప్రేక్షకుల అభిప్రాయాలను గౌరవించాలి. కథనంలో లోపాలను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత దర్శకులపై ఉంటుంది' అని తెలిపారు. అంతేకాదు, తొలి భాగంలో హాలీవుడ్ సినిమాలైన 'హ్యారీ పాటర్', 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' ప్రభావం కొంత ఉందని, రెండో భాగాన్ని మాత్రం మరింత భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, మన సంప్రదాయాలకు దగ్గరగా తెరకెక్కించాలని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ షూటింగ్ ప్రారంభ తేదీ, విడుదల తేదీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మరి ఈసారి రణబీర్ కపూర్‌తో అయాన్ ఎలాంటి అద్భుతమైన అస్త్ర ప్రపంచాన్ని చూపిస్తారో వేచి చూడాల్సి ఉంది.

15 ఏళ్ల తర్వాత మరోసారి.. షారుఖ్ ఖాన్‌తో స్టెప్పులేయనున్న బీటౌన్ బ్యూటీ!



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్, స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. షారుఖ్ ఖాన్ హీరోగా, సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్'. ఇందులో దీపికా పదుకొణె, సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, రాణి ముఖర్జీ, జైదీప్ అహ్లావత్, అర్షద్ వార్సీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తుండగా.. ఇప్పుడు కరీనా కపూర్ కూడా భాగం అయింది. షారుఖ్ అండ్ కరీనా కాంబినేషన్‌లో 'కింగ్' నుంచి రాబోతున్న ఓ స్పెషల్ సాంగ్ ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. 2011లో విడుదలైన 'రా.వన్' తర్వాత ఈ జోడీ మళ్లీ కలిసి డ్యాన్స్ చేయబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన 'తూ మిల్ జాయే తో' ఆకట్టుకోగా.. తాజాగా రెండో పాటగా 'డాడీ కూల్'ను విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. సచిన్-జిగర్ సంగీతంఅందించిన ఈ హింగ్లిష్ డ్యాన్స్ నంబర్‌లో షారుఖ్, కరీనా కలిసి స్టెప్పులేయనున్నారు. మరి ఈ సాంగ్ ఎలాంటి రికార్డ్స్ సృష్టిస్తుందోవేచి చూడాల్సిఉంది. కాగా..రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్,మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'కింగ్' డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

మరోసారి మెగాఫోన్ పట్టనున్న రియల్ స్టార్..



కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర మరోసారి దర్శకుడిగా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. చివరిగా 'ఖx' (2024) సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఆయన, ఇప్పుడు తన తదుపరి దర్శకత్వ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. నటుడిగా వరుస సినిమాలు చేస్తూనే ఖాళీ సమయాల్లో కొత్త కథను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. తన తదుపరి దర్శకత్వ సినిమాపై త్వరలోనే అధికారిక ప్రకటన ఉంటుందని ఉపేంద్ర తెలిపారు. ప్రస్తుతం రెండు సినిమాల షూటింగ్స్ పూర్తిచేయాల్సి ఉందని, అవి ముగిసిన వెంటనే దర్శకత్వ బాధ్యతలు చేపడతానని రీసెంట్‌గా ఓ బ్రాడ్‌కాస్ట్‌లో ఓపెన్ అయ్యారు.అంతే కాకుండా ఆయన దర్శకత్వం వహించబోయే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రకటన వచ్చిన తర్వాత సినిమా కథాంశంపైపూర్తి అవగాహన వస్తుందని ఆసక్తి రేకెత్తించారు. ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తమిళ సినిమాలో ఉపేంద్ర నటిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందుతున్నఈ చిత్రంలోప్రభుదేవా, అధర్వా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 24 ఏళ్ల తర్వాత ఉపేంద్ర, ప్రభుదేవా కలిసి నటిస్తుండటం ప్రత్యేక ఆకర్షణ. అలాగే అరవింద్ కౌశిక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నెక్ట్ లెవల్' సినిమాలోనూ ఉపేంద్ర నటిస్తున్నారు. మొత్తానికి నటుడిగా, దర్శకుడిగా ఉపేంద్ర

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com